సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 23 । మే । 2023



ఎండలు'మండే'

మన్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు నిప్పులు చెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 8లో



గర్భిణులకు ఆలంబనగా..

మారుమూల గ్రామాల్లో గర్భిణులను ప్రసవానికి ముందే వసతిగృహాలకు తీసుకువచ్చి ఉత్తమ సేవలందిస్తున్నారు. 8లో



'ఆంత్రాక్స్' టీకాలు తప్పనిసరి

పశువులకు ఆంత్రాక్స్ నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్థక శాఖ ఏడీ గణేశ్వరరావు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ప్రవేశ పరీక్షకు విశేష స్పందన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లిరూరల్: పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను ఉచితంగా ఇచ్చేందుకు సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు మంచి స్పందన లభించినట్టు అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. ఈ పరీక్షకు 250 మంది హాజరు కాగా, వారిలో ప్రతిభ కనబరిచిన 50 మంది యువతీయువకులను ఎంపిక చేసి ఏడాది పాటు ప్రత్యేక శిక్షణ, నెలకు రూ.1000 చొప్పున స్టైఫండ్ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. గ్రూప్స్,కానిస్టేబుల్,బ్యాంకింగ్ తదితర ఉద్యోగ పరీక్షలకు కోచింగ్ ఇవ్వనున్నట్టు చెప్పారు.

వాకపల్లిని సందర్శించిన ఏఎస్పీ



డస్ట్‌బిన్‌లను అందజేస్తున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్ తెలిపారు. మండలంలో నుర్మతి ఆర్మ్‌డ్ ఔట్ పోస్టు పోలీస్‌స్టేషన్, దాని పరిధిలో గల వాకపల్లి గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వాకపల్లిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సీఆర్‌పీఎఫ్198 బెటాలియన్ పోలీసులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. గ్రామస్తులకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్198బీఎన్ ఓసీ ఉదయ్‌కుమార్, సర్పంచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద పరిస్థితులపై ఆరా



వరదలపై సమాచారం తెలుసుకుంటున్న ఏఎస్పీ

కూనవరం: చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించారు. గోదావరి వరద పరిస్థితుల వివరాలు తెలుసుకున్నారు. గోదావరి వరదల సమయంలో ప్రజలను ఎక్కడికి తరలిస్తారు. సురక్షిత ప్రదేశాలు ఎక్కడెక్కడ ఉన్నాయి. ఏ స్థాయిలో వరదలు వస్తే ఎన్ని గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. రహదారులు ఎక్కడెక్కడ మునుగుతాయి. ఎన్ని బోట్లు వినియోగిస్తున్నారు. ఎమర్జెన్సీ సేవలకు ఉపయోగపడే రహదారులు ఏవి తదితర విషయాలు తెలుసుకున్నారు.వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన అంశాలపై ఆరా తీశారు. స్థానిక ఎస్ఐ బి.వెంకటేష్, వీఆర్‌పురం ఎస్ఐ తెల్లం దుర్గా ప్రసాదు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజనసంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 22 నుంచి 31 వరకు బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి కచ్చితంగా రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఒకే చోట ఎవరైతే ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నారో వారు కచ్చితంగా బదిలీ కావాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత గల ఉపాధ్యాయులు ఈనెల 23 నుంచి 26వరకు పాడేరు ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న తాత్కాలిక మెరిట్ జాబితా ప్రకటిస్తామని ఏమైన అభ్యంతరాలు ఉంటే 28న తెలపాలని, 29న తుది మెరిట్ జాబితా ప్రకటిస్తామని తెలిపారు. 31న ఐటీడీఏ సమావేశ మందిరంలో బదిలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

పాడేరు రూరల్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని టీడబ్ల్యూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయులు ఐటీడీఏ పీవో సమక్షంలో జరిగే ఈ కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలన్నారు.

కల్యాణం.. కమనీయం

పులిమెట్ట పులకించిపోయింది.. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది...కల్యాణ వెంకన్నను కనులారా వీక్షించి భక్తులు అలౌకికానందంతో పరవశించిపోయారు. ఐ.పోలవరంలో టీటీడీ నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. అంతకు ముందు మహాసంప్రోక్షణ, ఇతర వైదిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

- ఘనంగా శ్రీనివాసుని కల్యాణం
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన పులిమెట్ట



ఉత్సవ విగ్రహాలకు పూజలు



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

రంపచోడవరం: మండల కేంద్రం రంపచోడవరానికి సమీపంలోని ఐ. పోలవరం జంక్షన్ వద్ద పులిమెట్టపై నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి కల్యాణాన్ని కనులారా తిలకించిన భక్తులు పరవశించిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన రుత్వికులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని కల్యాణాన్ని అశేష భక్త జన సందోహం మధ్య వైభవోపేతంగా నిర్వహించారు. వేంకటేశ్వరుడు కొలువైన పులిమెట్ట ఆలయం భక్త జన సందోహంతో కిక్కిరిసిపోయింది. గోవిందా నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. సోమవారం ఉదయం వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రోజంతా అనేక వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీనివాసుని కల్యాణం, తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా మహాసంప్రోక్షణం

పులిమెట్టపై టీటీడీ నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయ మహాసంప్రోక్షణ సోమవారం ఆగమోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి 8.15 గంటల వరకు సుప్రభాతం సేవ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8.15 గంటల నుంచి 8.45 గంటల వరకు యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల వరకు యాత్ర దానము, కుంభ ప్రదక్షిణ చేశారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య మిథున లగ్నంలో మహాసంప్రోక్షణ, కళావాహన జరిపారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు.

భక్తులకు దర్శనం

మహాసంప్రోక్షణ అనంతరం ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. రంపచోడవరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులందరికీ, తాగునీరు,మజ్జిగ,అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారి సేవకుల విశేష సేవలు

వేంకటేశ్వరస్వామి ఆలయ మహాసంప్రోక్షణ సందర్భంగా ఆరు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, ఆలయానికి అవసరమైన పూల దండలు కట్టడం తదితర సేవలు అందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 500 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

ఆకట్టుకున్న భజనలు, కోలాటాలు

ఆలయం వద్ద గల వేదికపై టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు వివిధ కళారూపాలను ప్రదర్శించాయి. కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విపత్తి వేణుగోపాలరావు, జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, పీఆర్వో డాక్టర్ రవి, ఎస్ఈ టి.వి.సత్యనారాయణ, వీజీవో శ్రీ మనోహర్, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈఈ సుధాకర్, రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ శ్రీనివాసరావు, ఎంపీపీ బందం శ్రీదేవి, సర్పంచ్ కుంజము వెంకట లక్ష్మి, జెడ్పీటీసీలు పండా వెంకటలక్ష్మి, బేబీ రాణి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, పండా కుమారి, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ,ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, తహసీల్దార్ పి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఎం.వి.ఆర్. కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి. వేదిక పై ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే ధనలక్ష్మి

జనన ధ్రువ పత్రాలు జారీ చేయకపోతే డిస్మిస్

- కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జనన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీచేయని పక్షంలో సర్వీసు నుంచి తొలగిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం రాత్రి ఆయన అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జనన ధ్రువీకరణ పత్రాల జారీకి డిజిటల్ అసిస్టెంట్లు,పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని ఆదేశించారు. సుమారు 12వేల మందికి జనన ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా,ఈవారంలో కేవలం 220మాత్రమే జారీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.పెదబయలు మండలంలో కేవలం ఐదుగురికి మాత్రమే జారీ చేశారని, గిరిజనులకు అందించే సేవలు ఇవేనా అంటూ కలెక్టర్ మండిపడ్డారు. వచ్చేనెల 30వ తేదీలోగా జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని, దరఖాస్తుదారుల నుంచి ఎలాంటి అఫిడవిట్లు అడగరాదని,వీటి జారీలో జాప్యం జరిగితే డిజిటల్ సహాయకులను ఎలాంటి విచారణ లేకుండానే విధుల నుంచి తొలగిస్తానని హెచ్చరించారు.జూలై 12నుంచి పాఠశాలల ప్రారంభమవుతాయని,ఈలోగా పిల్లలకు ఆధార్ కూడా చేయాలని,తద్వారా అమ్మఒడి అమలుజేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 39వేలమందికి ఆధార్ సరిగా లేదని,తల్లికి ఆధార్ ఉన్నా,బిడ్డకు లేకపోవడం,కొన్నిచోట్ల ఇద్దరికీ ఒకే ఆధార్ ఉండడం తదితర సాంకేతిక సమస్యలను గుర్తించామని,వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.ఐదేళ్ల దాటిన పిల్లలకు ఈకేవైసీ చేయించి అమ్మఒడి అమలుజేయాలన్నారు. జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం,గృహనిర్మాణాలు,రక్తదాన శిబిరాలు,భూముల రీసర్వేపై కలెక్టర్ సమీక్షించారు.జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని,లేని పక్షంలో సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని,ఎఫ్‌టీవోలు జనరేట్ చేయాలని,భూముల రీసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని,డీపారం పట్టా భూముల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.డీఆర్వో అంబేడ్కర్,డ్వామా పీడీ రమేష్ రామన్,డీపీవో కొండలరావు,డీఎల్‌పీవో కుమార్,సీపీవో ఆర్,పట్నాయక్ పాల్గొన్నారు.

జీవవైవిధ్యం సంరక్షణ అందరి బాధ్యత

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో జీవవైవిధ్యం సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. స్థానిక కాఫీ హౌస్‌లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని సోమవారం వాసన్,ఆర్‌వైఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించాయి. జీవ వైవిధ్యానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జీవోలు,వ్యవసాయ శాఖ, ఇతర అనుబంధ శాఖలు, కాఫీ లైజన్ వర్కర్స్‌తో కలిసి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జీవవైవిధ్యం పరిరక్షణకు చురుగ్గా పనిచేయాలని సూచించారు. జీఈఎఫ్. ఎస్‌ఏటీపీఎల్ ప్రాజెక్టులపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు. వ్యవసాయ అధికారి పాత్రో మాట్లాడుతూ పంటల వైవిధ్యానికి,సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి, పశు సంవర్ధక శాఖ అనుసంధానంతో కృషి చేస్తామన్నారు. ఆర్‌వైఎస్ఎస్ సంస్థ డీపీఎం భాస్కరరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ గల అన్ని కేడర్ల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం సమావేశానికి హాజరైన అధికారులకు దుశ్శాలువాలతో సత్కరించారు.జీవవైవిధ్యం పరిరక్షణకు అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధి, ఎం.ఎల్.సన్యాసిరావు,ఆర్‌పి అధికారులు వినూత్న, శ్రీధర్, డీపీఎం భాస్కరరావు, సంజీవని సంస్థ డైరెక్టర్ దేముళ్లు,అమృత సంస్థ ప్రతినిధి మురళి, ఎఫ్ఈఎస్‌లు మురళి కౌసల్, ఆదివాసి మిత్ర సంస్థ ప్రతినిధి మన్మధరావు పాల్గొన్నారు.

మోతుగూడెం ఎస్ఐ లొంగుబాటు

- గంజాయి కేసులో అరెస్టు
- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

చింతూరు : నెల్లూరులో నమోదైన గంజాయి కేసుకు సంబంధించి పరారీలో ఉన్న మోతుగూడెం ఎస్ఐ సత్తిబాబు చింతూరు సీఐ అప్పలనాయుడు ఎదుట లొంగిపోయినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అతనిని రంపచోడవరం ఓఎస్డీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విచారించిన అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించినట్టు తెలిపారు. గత నెల 21న మోతుగూడెం ఎస్ఐ సత్తిబాబు, కానిస్టేబుల్ శివప్రసాద్‌తో పాటు మణి, మరి కొంతమందిపై నెల్లూరులో నమోదైన గంజాయి కేసులో ప్రమేయం ఉన్నందున వారిపై మోతుగూడెం పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేశామని ఎస్పీ వివరించారు. ఎస్ఐ సత్తిబాబు, కానిస్టేబుల్ శివప్రసాద్ గంజాయి స్మగ్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు గంజాయి రవాణాకు సహకరించారని ఆయన పేర్కొన్నారు. కేసు విచారణలో శివప్రసాద్‌తో పాటు మణి అనే వ్యక్తిని ఇప్పటికే అరెస్టు చేయగా ఎస్ఐ సత్తిబాబు అప్పటి నుంచి పరారీలో ఉన్నారని ఆయన తెలిపారు. సోమవారం ఆయన చింతూరులో లొంగిపోగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, ఈ కేసులో ఇంకా విచారణ కొనసాగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

విజయవంతంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



విద్యార్థులతో శాప్ జిల్లా అధికారి జగన్‌మోహన్‌రావు

అరకులోయ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు విజయవంతంగా జరుగుతున్నాయని శాప్ జిల్లా అధికారి జగన్మోహన్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 1వ తేదీ నుంచి గిరిజన గురుకుల క్రీడా పాఠశాల కోచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. పలు క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులతో ఆయన మాట్లాడి, కోచ్‌లను అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సూరిబాబు,కోచ్ కె.గణపతి పాల్గొన్నారు.

దీర్ఘాయుష్మాన్ భవ



ఈ బాలిక పేరు ఎలిపి ప్రవర్ష. కూనవరం మండలం టేకులబోరుకు చెందిన 12 ఏళ్ల ఈ బాలిక చాలాకాలంగా సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతోంది. వైద్యం కోసం తల్లిదండ్రులు లక్షల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ప్రభుత్వం ఆమెకు ఏడాదిగా ప్రతినెలా రూ. 10 వేలు పింఛను అందచేస్తోంది. ఆ సొమ్ము ఆమె వైద్య ఖర్చులకు ఉపయోగపడుతోంది.



చింతూరు మండలం ఎర్రంపేటకు చెందిన ఇతని పేరు పాండ్రు ముత్తయ్య. మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో కాకినాడ, రంపచోడవరంలలో డయాలసిస్ చేయించుకున్న ముత్తయ్య ప్రస్తుతం చింతూరు ఏరియా ఆస్పత్రిలో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అతనికి పింఛను కింద ప్రతినెలా రూ.10 వేలు అందజేస్తోంది. ఈ నగదు వైద్య ఖర్చులతో పాటు కుటుంబ పోషణకు ఉపయోగపడుతోందని బాధితుడు తెలిపాడు.

- దీర్ఘకాలిక రోగులకు ప్రభుత్వం అండ
- రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్
- జిల్లాలో 719 మందికి ప్రయోజనం
- ప్రతినెలా రూ 66.42 లక్షలు పంపిణీ

చింతూరు: దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు 719 మంది ఉండగా వీరికి పింఛన్‌గా రూ.66.42 లక్షలను ప్రభుత్వం అందజేస్తోంది. వలంటీర్ల ద్వారా ప్రతినెలా ఒకటో తేదీన ఆ నగదును లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛను నగదుతో బాధితులు తమ కుటుంబానికి భారం కాకుండా గడుపుతూ వారి ఆయుష్షును పెంచుకుంటున్నారు.

పెన్షన్ మంజూరు ఇలా..

జిల్లాకు సంబంధించి విశాఖలోని కేజీహెచ్, కాకినాడలోని జీజీహెచ్‌లో మెడికల్ బోర్డు కమిటీ రోగ నిర్ధారణ చేశాక, పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. అనంతరం వ్యాధి నిర్ధారణ ఆధారంగా రోగులకు ధ్రువీకరణ పత్రాలు అందచేస్తారు. దానికి రేషన్, ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబరు జతచేసి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందచేయాలి. ఆ దరఖాస్తును వైద్యశాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విభాగానికి అప్‌లోడ్ చేస్తారు. అక్కడినుంచి సంబంధిత దరఖాస్తు సెర్ప్ కార్యాలయానికి చేరిన అనంతరం పింఛను మంజూరయ్యాక రోగి వివరాలు సంబంధిత సచివాలయానికి వెళ్తాయి. సంబంధిత వలంటీరు ద్వారా ప్రతినెలా ఒకటో తేదీన నగదును లబ్ధిదారులకు అందచేస్తారు.

జిల్లాలో మెడికల్ పెన్షన్ అందుకునే వారి వివరాలు ఇలా..

వ్యాధి	లబ్ధిదారులు	పెన్షన్ మొత్తం(రూ.ల్లో)
రూ 10 వేలు అందుకునే వారి వివరాలు		
తలసేమియా	23	2,30,000
సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు	587	58,70,000
హీమోఫోలియా	5	50,000
కిడ్నీ	2	20,000
రూ 3, రూ 5 వేలు అందుకునేవారు		
ఎలిఫెంటియాసిస్-4	5	25,000
పక్షవాతం	46	2,30,000
ప్రమాద బాధితులు	34	1,70,000
క్షయ(లెప్రసీ)	14	42,000
కాలేయం, గుండె మార్పిడి	2	10,000



చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

పేదలకు ఎంతో ఉపయోగం



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే పేదలకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. ప్రభుత్వం పాడేరులో కొత్తగా హెచ్‌పీఎల్‌సీ మిషన్ ఏర్పాటు చేయడంతో విశాఖపట్నం వెళ్లే అవసరం లేకుండా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఇక్కడే వ్యాధి నిర్ధారణ జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో 719 మందికి రూ 3 వేల నుంచి రూ 10 వేల వరకు పెన్షన్ అందచేస్తున్నాం.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంఅండ్‌హెచ్‌వో

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



వారపు సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ సుభద్ర, అటవీశాఖ సిబ్బంది

గూడెంకొత్తవీధి: పాలిథిన్, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని ఇందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎంపీపీ బోయినకుమారి అన్నారు. పంచాయతీ సర్పంచ్ సుభద్ర, అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో కలసి ఆమె సోమవారం ఆర్వీనగర్ వారపు సంతలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంతల్లో పాలిథిన్ కవర్లను పూర్తిగా నిషేధించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాలిథిన్ సంచులు వినియోగించే వారిపై పంచాయతీ తరపున అపరాధ రుసుము విధించాలన్నారు. ఇళ్లల్లో వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అప్పగించాలన్నారు.

గర్భిణులకు ఆలంబనగా..

- మాతా శిశు మరణాల నివారణే ప్రభుత్వ లక్ష్యం
- గూడెంకొత్తవీధిలో రూపుదిద్దుకున్న గర్భిణుల వసతిగృహం
- అందుబాటులోకి రానున్న సేవలు
- ఆనందంలో గిరిజనులు

గూడెంకొత్తవీధి: మన్యంలో మాతా శిశు మరణాల నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగం మారుమూల గ్రామాల్లో గర్భిణులను ప్రసవానికి ముందే ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకువచ్చి ఉత్తమ సేవలందిస్తోంది.

అవగాహన రాహిత్యంతో అవస్థలు

గిరిజనుల నిరక్షరాస్యత అవగాహన లేమి వంటి కారణాల వల్ల గర్భిణులు ఆస్పత్రులకు వచ్చేందుకు వెనకాడి, ఒక్కోసారి నెలలు నిండి పురిటి నొప్పులు వచ్చే వరకూ ఇళ్ల వద్దే ఉండిపోతున్నారు. చివరి నిమిషంలో నొప్పులు అధికమై ప్రసవం కష్టమవుతున్న సమయంలో అప్పటికప్పుడు హడావుడిగా ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే 108 వాహనాల్లో ప్రసవాలు అవుతున్న సంఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితులను పూర్తిగా మార్చాలని ప్రభుత్వ యంత్రాంగం భావిస్తోంది. ఈ పరిస్థితులను రూపుమాపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గర్భిణులకు ప్రసవ సమయానికి ముందుగానే ఆస్పత్రులకు తరలించేందుకు



గూడెంకొత్తవీధిలో ప్రారంభానికి సిద్ధమైన గర్భిణుల వసతిగృహం

చర్యలు చేపట్టింది. ఇందుకోసం వసతిగృహాలను నిర్మిస్తోంది. ఈ మేరకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ తరచూ మన్యంలో మాతా శిశు మరణాల నివారణపై ప్రత్యేక సమావేశాలు పెడుతూ అధికారులకు సూచనలు చేస్తున్నారు.

గర్భిణుల వసతి గృహం నిర్మాణం

అల్లూరి జిల్లాలో అరకు, రంపచోడవరం, చింతపల్లి ప్రాంతాల్లో మాత్రమే గర్భిణుల వసతిగృహాలున్నాయి. వీటిని దశలవారీగా ప్రతి మండలంలోనూ నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నాడు-నేడు పథకంలో భాగంగా సుమారు రూ.35లక్షలు వెచ్చించి గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలోనే ప్రత్యేకంగా గర్భిణుల వసతిగృహాన్ని నిర్మించారు. ఇది గత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి హయాంలోనే నిర్మాణం పూర్తి చేసుకుంది. దీన్ని త్వరలో ప్రారంభించుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుతున్న సేవలివీ...

వసతిగృహం అందుబాటులోకి వస్తే గర్భిణులు ప్రసవానికి వారం రోజులముందుగానే ఇక్కడకు చేరుకోవచ్చు. గర్భిణితోపాటు వారి వెంట వచ్చే సహాకులకు పూర్తి ఉచితంగా భోజన సదుపాయం. గర్భిణులకు మూడుపూటలా పాలు, అల్పాహారం, పౌష్టికాహారం, వంటివి అందిస్తారు. అవసరమైన మందులు నిత్యం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రసవానంతరం మరో నాలుగైదు రోజులవరకూ తల్లీ బిడ్డలకు ప్రత్యేక వైద్య సేవలు. అనంతరం వారి స్వగ్రామాలకు సురక్షింతంగా వాహనంలో తరలింపు

ఆనందంగా ఉంది



గర్భిణుల వసతి గృహం అందుబాటులోకి రానుండడం ఆనందంగా ఉంది. ఆస్పత్రికి దగ్గరగా ఉండడంతో ఏ సమయంలో ప్రసవ నొప్పులు వచ్చినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇబ్బందులు తప్పుతాయి.

–వంతల నీలమ్మ, మల్లికార్జున గ్రామం, జీకే వీధి మండలం

నిరంతర పర్యవేక్షణ



పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 64 గ్రామాల్లో గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వం నూతనంగా నాడు–నేడు పథకంలో గర్భిణుల వసతి గృహాన్ని నిర్మించింది. ఈ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారంతోపాటు నిరంతరం వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది.ప్రసవానంతర సమస్యలకూ ఇబ్బంది ఉండదు.

–డాక్టర్ వినయ్‌కుమార్, వైద్యాధికారి, గూడెంకొత్తవీధి

మారథాన్ పోటీల్లో రాణించిన సచివాలయ ఉద్యోగి



మారథాన్ పోటీల్లో పాల్గొన్న గోపి

అనంతగిరి: ప్రపంచస్థాయి మారథాన్ పోటీల్లో మండల సచివాలయ ఉద్యోగి కొర్రా గోపి రాణించారు. బెంగుళూరులోని ఆదివారం టీసీఎస్ నిర్వహించిన ప్రపంచస్థాయి 10కే మారథాన్ పోటీల్లో అనంతగిరి మండలంలోని రొంపల్లి పంచాయతీ సచివాలయం ఉద్యోగి కొర్రా గోపి 21 స్థానంలో నిలిచాడు. పోటీల్లో 25 నుంచి 29 సంవత్సరాల కేటగిరీలో 1611 పాల్గొనగా, గోపీ 21వ స్థానం దక్కించుకున్నాడు. పోటీల్లో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, కెన్యా, ఇథియోపియా, తదితర దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో 18 నుంచి 80 వయస్సుల్లో వివిధ కెటగిరీల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో పాల్గొనేందుకు, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సహకారం అందించారు. దీంతో ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలను గోపి తెలిపాడు. మారథాన్ పోటీల్లో రాణిస్తుండడం పాటుగా మండలానికి మంచి పేరు తెస్తుండడంతో మండలస్థాయి అధికారులంతా గోపిని అభినందించారు.

కల్తీ పెట్రోల్‌తో అవస్థలు



బంకు నుంచి వచ్చిన కల్తీ పెట్రోల్

ముంచంగిపుట్టు: కల్తీ పెట్రోల్‌తో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.బంకు నుంచి వాహనాలకు పెట్రోల్ వేయిస్తే నీటితో కలిసిన పెట్రోల్ రావడం వాహనదారులు కంగుతింటున్నారు.మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ సేల్లుం గ్రామ సమీపంలో ఉన్న ప్రైవేట్ పెట్రోల్ బంకు కల్తీ పెట్రోల్‌కు నిలయంగా మారింది. పెట్రోల్ వేయిస్తే నీటితో కలిసిన పెట్రోల్ వస్తుండడం వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాజ్‌కుమార్ అనే వాహనదారుడు తన బైకుకు సేల్లుం పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ పోయించగా బైకు స్టార్ట్ అవ్వలేదు. ఎన్ని సార్లు స్టార్ట్ చేసిన అదే పరిస్థితి దీంతో బైకులో పోయించిన పెట్రోల్‌ను బాటల్‌లో వేసి చూడగా పెట్రోల్ మొత్తం బురదనీటితో కల్తీగా ఉండడం గమనించి షాక్‌కు గురయ్యాడు .దీంతో బంకు నిర్వాహకులను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో వాహనదారుడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాద్ చేశాడు.కల్తీ పెట్రోల్ అమ్ముతున్న బంకు నిర్వాహకుడు,యాజమానిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ విషయంపై ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ బంకు నిర్వాహకులను ప్రశ్నించామని, ట్యాంకు అడుగు భాగంగా లీకేజీ వల్ల ఈ సమస్య ఉత్పన్నమైనట్లు చెప్పారన్నారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని బంకు యజమాని తెలియజేసినట్లు పేర్కొన్నారు.

'ఆంత్రాక్స్' టీకాలు తప్పనిసరి

అరకులోయ రూరల్: పశువులకు ఆంత్రాక్స్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ సాగర గణేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువులు,మేకలు,గొర్రెలకు సంబంధిత రైతులు సకాలంలో ఆంత్రాక్స్ వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పాడిరైతులు నష్టపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శీనయ్య, సిబ్బంది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గన్నెల పంచాయతీలో టీకాలు

గన్నెల పంచాయతీ తడాక,పాలగూడ,పూజరిబంధ,తోటవలస, కందులుగుడి,పెదవలస,కాగువలస గ్రామాల్లో మంగళవారం పశువులకు ఆంత్రాక్స్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జిఏడీ గణేశ్వరావు తెలిపారు. గతంలో మేక మాంసం తిని గిరిజనులు మృతి చెందిన సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పోలీసుల చేయూత



బాధితులతో మాట్లాడుతున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: మండలంలోని బొడ్రాయిగూడెంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు పోలీసులు చేయూత అందించారు. రంపచోడవరం ఓఎస్డీ కేవీ. మహేశ్వరరెడ్డి, చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా సోమవారం రాత్రి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది, ఎంతనష్టం జరిగిందనే విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు. బాధితులను ఆదుకునేందుకు పోలీసుశాఖ తరపున తగిన కృషి చేస్తామని, ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి తగిన సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు బాధితులకు భరోసా కల్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, వంటసామాగ్రిని అందచేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్పీ జలపాత సందర్శన



జలపాతాన్ని సందర్శించిన ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతాన్ని సోమవారం పాడేరు ఏఎస్పీ ధీరజ్ సందర్శించారు. జలపాతం, ప్రకృతి అందాలను ఆయన ఆస్వాదించారు. కొద్ది సేపు ఇక్కడ గడిపారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ, జలపాత నిర్వాహక కమిటీ సభ్యులు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

- 25 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్, ఎంపీడీవో లాలం సీతయ్య

చింతపల్లి:.రక్తదానం ప్రాణదానంతో సమానమని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు.సోమవారం మండల కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్‌తో పాటు 24 మంది రక్తదానం చేశారు. గిరిజన గ్రామాల్లో అనేక మంది బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, అన్ని గ్రూపుల రక్తం అందుబాటులో ఉండడం వల్ల సకాలంలో సేవలు అందుతాయన్నారు. ప్రభుత్వం గిరిజనుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో పాడేరు, చింతపల్లి, అరకు రక్తనిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో సేవలందిస్తున్నాయన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి సాటి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు. ఎంపీడీవో లాలం సీతయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

కుమార్తెను చూడడానికి వెళుతూ..



మృతుడు సోమనాద్రి అప్పారావు

మాడుగుల రూరల్ : కుమార్తెను చూడడానికి ద్విచక్ర వాహనం మీద బయలుదేరిన వ్యక్తి హఠాత్తుగా ప్రాణాలు విడిచాడు. వడదెబ్బ కారణంగా చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మండలంలో చింతలూరు గ్రామానికి చెందిన సోమనాద్రి అప్పారావు(60) సోమవారం స్కూటీ మీద కుమారుడితో కలిసి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఆయన ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగా, ఎం.కోటపాడు గ్రామం దాటేసరికి వడదెబ్బ తగలడంతో రహదారి మీద పడిపోయి చనిపోయారు. అప్పారావు కుమారుడు అ సమయంలో పక్కనే వున్నారు. సోమవారం ఎండ త్రీవత ఎక్కువగా వుంది. వడదెబ్బతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం చింతలూరుకు తీసుకెళ్లారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఎటపాక: ఎదురుగా వస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన సోమవారం ఉదయం తోటపల్లి సమీపంలో జరిగింది. మండలంలోని మురుమూరు గ్రామానికి చెందిన జంపయ్య తన ఆటోలో ఇద్దరు ప్రయాణికులతో భద్రాచలం వెళ్తున్నాడు. ఈ క్రమంలో కూనవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటో ముందు భాగం దెబ్బతినగా, జంపయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ఆగకుండా వెళ్లిపోవడంతో బాధితులు ఎటపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు కాకినాడ డిపోకు చెందినట్టుగా బాధితులు చెబుతున్నారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

- విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్రనాథ్



లంబసింగిలో సర్క్యూట్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

నర్సీపట్నం: వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. విద్యుత్ సరఫరా విధానంపై నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నంలో ఇండోర్ సబ్ స్టేషన్‌కు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.70 లక్షలతో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి మూడు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పట్టణ ప్రజలకు లోవోల్టేజ్ సమస్య ఉండదన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చింతపల్లి మండలం లంబసింగిలో రూ.12 లక్షలతో నిర్మించిన సర్క్యూట్ బ్రేకర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈదురుగాలులు, వర్షాల వల్ల చెట్ల కొమ్మలు విరిగిపడటం వల్ల సరఫరాకు అంతరాయం కలగకుండా సర్క్యూట్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే తెలుస్తుందన్నారు. వెనువెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమీక్షలో ఈఈ సురేష్‌బాబు, ఏడీ సత్యానందం, విద్యుత్ ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్ : మండలంలో గొలగాం పంచాయతీ గుమస్తా కాలనీకి చెందిన యలమంచిలి దిలీప్(19) పొలాల్లో సోమవారం ఉరి వేసుకొని మృతి చెందాడు. గ్రామీణ ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. చుట్టు పక్కల రైతుల సమాచారం ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

సారా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం నేడు

పాడేరు రూరల్ : సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను 23వ తేదీ సాయంత్రం 4గంటలకు పాడేరు ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్ఈబీ సీఐ సంతోష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్ కార్డు తీసుకురాలని, వేలంలో వాహనాలు పొందే వారు అదేరోజు పూర్తి సొమ్మును జీఎస్టీతో కలిపి చెల్లించాలన్నారు.

నేడు మినీ జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం 4 కంపెనీలతో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్, బీటెక్, పీజీ విద్యార్హత గల నిరుద్యోగులు జాబ్‌మేళాకు అర్హులని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7013342667 సంప్రదించాలని ఆయన కోరారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ సీనియర్ ఫోర్‌మెన్ ఇంగువ శ్రీనివాసరావు (48) ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. కొయ్యూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు తన కుటుంబంతో టౌన్‌షిప్‌లోని సెక్టార్–6కు చెందిన 343 ఎఫ్ క్వార్టర్‌లో నివశిస్తున్నారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన శ్రీనివాసరావు విధులకు కూడా సరిగా వెళ్లడం లేదు. ఇంట్లో మద్యం తాగుతూ గడుపుతున్నాడు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం తన రూంలోకి వెళ్లిన శ్రీనివాసరావు ఎంతసేపటికీ రాకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా కిటికీకి ఉరి వేసుకుని కనిపించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించగా సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచకు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎండలు 'మండే'

సాక్షి,పాడేరు: మన్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు నిప్పులు చెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అరకులోయ,పాడేరు,జి.మాడుగుల,చింతపల్లి ప్రాంతాలలో 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.మధ్యాహ్నం వేళలో అధిక ఎండను తాళలేక వారపుసంతలకు,వ్యవసాయ పనులకు వెళ్లిన గిరిజనులు అవస్థలకు గురయ్యారు.సంతల్లోను,మండల కేంద్రాలు,ప్రధాన జంక్షన్‌లలో శీతల పానీయాలను ఆశ్రయించారు.పశువుల కాపర్లు అధిక ఎండ తాళలేక గొడుగులను ఆశ్రయించారు.నీడ ఉన్న ప్రదేశాలకే గిరిజనులు పరిమితమయ్యారు.



జి.మాడుగుల–చింతపల్లి రోడ్డులో లువ్వాసింగి జంక్షన్ వద్ద చెట్ల నీడన నిరీక్షిస్తున్న గిరిజనులు